నేడు రైతు దీక్ష

బండ్లగూడ, జనవరి 16 : రంగా రెడ్డి జిల్లా షాబాద్‌లో రైతులకు మద్దతుగా నేడు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగే రైతు దీక్షకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రావుల కోళ్ల నాగరాజు తెలిపారు.గురువారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు చేసిన మోసాలను వివరించి వారి తరుపున దీక్ష చేపడుతున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి ప్రతి నాయకుడు కార్యకర్త తమ వంతు కర్తవ్యంగా రావాలని పిలుపునిచ్చారు.

రైతు భరోసాకై భూముల పరిశీలన

బండ్లగూడ,జనవరి 16 :రాజేంద్ర నగర్ మండల కేంద్రంలో రైతు భరోసా సర్వేను అధికారులు పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గురువారం రాజేంద్రనగర్ మండల తహసీల్దార్ రాములుతో కలిసి జిల్లా వ్యవసాయ అధికారి నరసింహరావు,అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ అధికారిని లీనా, ఏవో కవిత తదితరులు కలిసి ప్రేమవతి పేట గ్రామంలో పంట పొలాలను పరిశీలించారు.ఈ సందర్భంగా రైతులను వారు పండించే పంటల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నరసింహ రావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల అనుసారంగా సాగుకు పనికొచ్చే భూములకు రైతు భరోసా ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

సర్వేను గడువులోగా పూర్తి చేయాలి

మేడ్చల్ కలెక్టరేట్, జనవరి 16 : రేషన్ కార్డుల సర్వేను గడువులోగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా అధికారులకు సూచించారు. నాగారం మున్సిపాలిటీలో గురువారం మొదలైన రేషన్ కార్డుల వెరిఫికేషన్‌ను ఆదనపు కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ.. ఆహార భద్రత కార్డుల సర్వే పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు.

హెచ్ఎంటీ భూముల ఆక్రమణ..!

రాత్రికి రాత్రే నిర్మాణం

శ్రీరాంనగర్ ఏలోని బస్టాప్ వెనుక ప్రాంతంలో హెచ్ఎంటీ భుముల్లో చేపట్టిన నిర్మాణం

దుండిగల్, జనవరి 16 : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో భూ ఆక్రమణలు జోరందుకుంటున్నాయి. ఎక్కడ ప్రభుత్వ స్థలం కనిపించినా భూ భకాసురులు ఆక్రమించేందుకు వెనుకాడటం లేదు. అధికారులు సైతం తమకెందుకు వచ్చిన తంటా అనే రీతిలో వ్యవహరిస్తుండటంతో విలువైన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. కుత్బుల్లాపూర్ తహసీల్దార్ పరిధి, గాజులరామారం రెవెన్యూ, రోడామిస్త్రీనగర్, శ్రీరాంనగర్ ఏలోని సర్వేనంబర్ 221, బస్టాప్ వెనుకాల రాత్రికి రాత్రి ఓ వ్యక్తి రూ.20లక్షల విలువ చేసే ప్రభుత్వభూమిని ఆక్రమించి నిర్మాణం చేపట్టారు. స్థానికులు వద్దని చెపుతున్నప్పటికీ తననెవరు అడ్డుకుంటారంటూ ప్రభుత్వ భూమిలో నిర్మాణం చేపట్టడం సంచలనంగా మారింది. వాస్తవానికి ఈ స్థలం కేంద్రప్రభుత్వ రంగసంస్థ హెచ్ఎంటీకి సంబంధించినది. దీనిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఎంత ఉందో హెచ్ఎం టీ యాజమాన్యంపైనా అంతే ఉంది. అయితే కొందరు రాజకీయ నేతల ఒత్తిడికి తలొగ్గుతున్న హెచ్ఎంటీ యాజమాన్యం తమ భూములు కబ్జాకు గురవుతున్నా రక్షించేందుకు చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫలితంగా తరచూ హెచ్ఎంటీ ఖాళీస్థలాన్ని ఆనుకుని ఉన్న భూములు ఆక్రమణలకు గురవుతున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికే పెద్దమొత్తంలో హెచ్ఎంటీ భూములు ఆక్రమణకు గురయ్యాయంటున్నారు. ఇకనైనా భూ ఆక్రమణలను అడ్డుకోకుంటే హెచ్ఎంటీ స్థలాలు కనమరుగయ్యే అవకాశం దగ్గర్లోనే ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

ఇదే విషయమై కుత్బుల్లాపూర్ మండలం డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున్‌ను వివరణ కోరగా...హెచ్ఎంటీ భూములు ఆక్రమణకు గురువుతున్నట్లు తమదృష్టికి రాలేదన్నారు. ఒకవేళ ఎవరైనా సదరు భూములను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. హెచ్ఎంటీ సంస్థ భూములను రక్షించాల్సిన బాధ్యత తమపై ఎంత ఉందో సదరు సంస్థ యాజమాన్యంపైనా అంతే ఉందన్నారు. భూ ఆక్రమణదారులపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి...

మున్సిపల్ కార్పొరేషన్ మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న రామచంద్రనాయక్, స్థానికులు

దుండిగల్, జనవరి 16: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, 31,32వ డివిజన్‌ల పరిధిలోని రాజీవ్‌గృహకల్ప సముదాయంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పలువురు స్థానికులు గురువారం మున్సిపల్ కార్పొరేషన్ మేనేజర్ పవన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ.. గృహకల్ప సముదాయంలో గత మూడు, నాలుగు సంవత్సరాలుగా డ్రైనేజీ పైపులైన్ల కోసం రోడ్డు తవ్వి పైపులైన్లు పూడ్చి సీసీ రోడ్డు వేయడం మానేశారని, సీసీ రోడ్డ కోసం కేటాయించిన ప్రజాధనం ఏమైందని, రోడ్లు ఎందుకు వేయలేదని ప్రశ్నించారు. 32వ డివిజన్‌లో డ్రైనేజీ కోసం 20 ఫీట్లలోతు 40 ఫీట్ల వెడల్పు, 50 ఫీట్ల పొడవు రోడ్డు తవ్వి దాదాపు నాలుగు నెలలు అయిపోయినా ఇంతవరకు అటువైపు కాంట్రాక్టర్ గానీ, అధికారులు గానీ కన్నెత్తి చూడటం లేదన్నారు. అంబేద్కర్ స్టాచ్యూ నుంచి కింద తురక చెరువు 55 బ్లాక్ వరకు డ్రైనేజీ పైపుల కోసం తవ్వుతున్నారు. 55 బ్లాక్ నుంచి సాయిబాబా గుడి ముందు భాగం రోడ్డు 49 బ్లాక్ వరకు డ్రైనేజీ కోసం తవ్వకాలు చేపట్టి రెండు సంవత్సరాలు కావస్తున్నా ఇంతవరకు సీసీ రోడ్డు వేయకపోవడం వల్ల కనీసం నడవడానికి దారిలేకుండా ఉంది. దోమల మందు కొట్టడానికి కూడా ఆస్కారం లేకుండాపోయింది. అదే సమయంలో చాలీచాలని తాగునీరుతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. దీనిపై మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకు లు రామచంద్రనాయక్, రాపాక రమేశ్, మార్తమ్మ, వెంకటరమణ, అంకిరెడ్డి, ఎల్లారెడ్డి, గణేశ్ మధు, మల్లేశ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో వ్యవసాయ భూములను గుర్తించాలి

● కలెక్టర్ గౌతమ్‌కుమార్

కీసర తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు కంప్యూటర్ ద్వారా సూచనలు చేస్తున్న మేడ్చల్ కలెక్టర్ గౌతమ్‌కుమార్

కీసర,జనవరి 16 : క్షేత్రస్థాయిలో పర్యటించి వ్యవసాయ, వ్యవసాయేతర భూములను గుర్తించి వివరాలను నమోదు చేయించాలని కీసర తహసీల్దార్‌ను మేడ్చల్ కలెక్టర్ గౌతమ్‌కుమార్ ఆదేశించారు. గురువారం కీసర తహసీల్దార్ కార్యాలయంలో మండంలోని వివిధ గ్రామాల్లో సర్వేనెంబర్ల ఆధారంగా వ్యవసాయ, వ్యవసాయేతర భూములను గుర్తించే పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జీపీఆర్ మ్యాప్ ద్వారా భూములను పరిశీలిస్తూ వ్యవసాయ యోగ్యమైనదా? కాదా? అని అధికా రులు ఖచ్చితంగా గుర్తించాలన్నారు. గ్రామాల వారీగా సమగ్ర నివేధికలను తయారు చేసి డాటా ఎంట్రీ చేయించాలని ఆదేశించారు. అవసరమైన చోట సర్వేయర్ల ద్వారా సమాచారం సేకరించి లేఅవుట్లు, నాలాగా మార్చిన భూములు, ఇండస్ట్రీయల్‌కు సంబంధించిన వివరాలను జాగ్రత్తగా సేకరించాలని కలెక్టర్ రెవెన్యూ అధికారులకు సూచించారు.

అనంతరం కలెక్టర్ మ్యాప్ ద్వారా చీర్యాల్, గోధుమకుంట గ్రామాల సర్వే నెంబర్ల ద్వారా పరిశీలించి అవసరమైన సలహాలు, సూచనలను చేశారు. కార్యక్రమంలో లా ఆఫీసర్ చంద్రావతి, తహసీల్దార్ అశోక్ కుమార్, ఆర్ఐలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ సన్నిధిలో ఎమ్మెల్యే మాధవరం..

విజయవాడ కనకదుర్గా మల్లేశ్వరస్వామి దేవాలయంలో గురువారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకుని వేద పండితులతో ఆశీర్వాదం తీసుకున్నారు. ఆయనతో బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు. – కేపీహెచ్‌బీ కాలనీ

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

గండిగూడలో సర్వేను తనిఖీ చేస్తున్న అడిషనల్ కలెక్టర్

శంషాబాద్ రూరల్, జనవరి 16 : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడం కోసమే క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తున్నట్లు జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతిమ సింగ్ తెలిపారు. గురువారం శంషాబాద్ మున్సిపాలిటీలోని గండిగూడ గ్రామంలో నిర్వహిస్తున్న సర్వేను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అందులో భాగంగా క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ రవీందర్ దత్, మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు,ఆర్ఐ కృష్ణలతో పాటు పలువురు అధికారులు ఉన్నారు.

లక్ష డప్పులు-వేల గొంతుల ప్రదర్శనకు తరలిరావాలి

సమావేశంలో మాట్లాడుతున్న ప్రముఖ గాయకుడు దరువు అంజన్న, ఎమ్మార్పీఎస్ నాయకులు

బొల్లారం, జనవరి 16: ఫిబ్రవరి 7న నగరంలో జరిగే లక్ష డప్పులు, వేల గొంతుల మహా ప్రదర్శనకు బీసీ కవులు, కళాకారులు, రచయితలు, మేధావులు లక్షలాదిగా తరలిరావాలని ప్రముఖ కవి, గాయకుడు దరువు అంజన్న పిలుపునిచ్చారు. కంటోన్మెంట్‌లోని డ్రీమ్‌లాండ్ గార్డెన్‌లో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 ఏండ్ల పోరాట ఫలితంగా ఎస్సీ వర్గీకరణ అమలు దగ్గరలోనే ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవతీసుకొని అధికారికంగా అమలు చేయాలని కోరారు. మంద కృష్ణ మాదిగ సుదీర్ఘ పోరాటం చాలా గొప్పదని కొనియాడారు. అనంతరం ప్రముఖ కవి, సీనియర్ జర్నలిస్టు మోహన్ బైరాగి మాట్లాడుతూ సుప్రీంకోర్టు సైతం వర్గీకరణ అమలు చేయాలని కోరిందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే అధికారికంగా అమలు చేయాలని కోరారు.

వరద కాలువ నిర్మాణ పనుల పరిశీలన

హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని నిజాంపేట రోడ్డు హోలిస్టిక్ దవాఖాన సమీపంలో చేపడుతున్న వరద కాలువ నిర్మాణ పనులను కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్‌రావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముంపు ముప్పుకు శాశ్వత పరిష్కారంగా వీటిని నిర్మిస్తున్నామన్నారు. ట్రాఫిక్ రద్దీ అధికం నేపథ్యంలో పనులను వేగంగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కార్పొరేటర్ సూచించారు. పనులు పూర్తయ్యే వరకు వాహనదారులు సైతం తమ తోడ్పాటును అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈ రాజీవ్, మహదేవ్, సుబ్బారావు పాల్గొన్నారు. – మియాపూర్ , జనవరి 16

ప్రయాణికురాలి పర్సు అప్పగింత..

మియాపూర్ ఆర్‌టీసీ డీపో– 2 కండక్టర్ కుమార్ ..తన నిజాయితీని చాటుకున్నారు. ఈ నెల 2న బస్సులో ఓ ప్రయాణికురాలు పర్సును మరిచిపోయింది. గుర్తించిన బస్ కండక్టర్ కుమార్ ఆ పర్సును డిపో సెక్యూరిటీలోఅందించారు. సదరు ప్రయాణికురాలు ఉషా వివరాలతో పాటు ఫోన్ నంబర్‌ను గుర్తించి గురువారం ఆమెను డిపోకు పిలిపించి పర్సును డీఎం, సెక్యూరిటీ సూపర్‌వైజర్ల సమక్షంలో అందించారు. పర్సులో రూ. 10,800 నగదుతో పాటు ఐదు గ్రాముల బంగారం ఉన్నట్లు ప్రయాణికురాలు తెలిపింది. కాగా.. నిజాయితీని చాటుకున్న కండక్టర్ కుమార్‌ను డిపో అధికారులు అభినందించి సత్కరించారు. – మియాపూర్

జ్యోతిర్లింగాలయం ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం

బాలాజీనగర్ డివిజన్‌లోని ద్వాదశ జ్యోతిర్లింగ ఆలయంలో ఆలయ నూతన కమిటీ సభ్యులు సురువు వెంకట్‌రావు, గంట విద్యాసాగర్, రంగా భాస్కర్‌గౌడ్, కృష్ణ, ఏంబరి శ్రీకాంత్, శారదశ్రీనివాస్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయల ప్రధాన అర్చకులు గోపాల్‌శర్మ, భక్తులు పాల్గొన్నారు. – కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 16

వృద్ధుడు అదృశ్యం

రాంచందర్ (ఫైల్)

జగద్గిరిగుట్ట, జనవరి 16 : ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వృద్ధుడు అదృశ్యమయ్యాడు. జగద్గిరిగుట్ట పోలీసు ల వివరాల ప్రకా రం .. రింగుబస్తీకి చెందిన రాంచందర్(65) పెయింటర్. కొంతకాలంగా ఇతనికి మతిస్థిమితం సరిగ్గా ఉండడంలేదు. ఈ క్రమంలో ఈనెల 15న ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. స్థానికంగా మొత్తం గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో అతని భార్య శశికళ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వ్యాపారి ఇంట్లో చోరీ

బంజారాహిల్స్,జనవరి 16: యజమాని ఇంట్లో నగదు చోరీ చేసిన పనిమనిషిపై బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 3లో నివాసం ఉంటున్న నితిన్ సింఘానియా అనే వ్యాపారి ఇంట్లో ఈనెల 13న టేబుల్ మీద పెట్టిన రూ.93 వేల నగదు మాయమయ్యాయి. ఇంట్లో ఉన్న వారందరినీ వాకబు చేయగా తమకు తెలియదని తెలిపారు. తమ ఇంట్లో పనిచేస్తున్న శారద అనే పనిమనిషి మీద అనుమానం వ్యక్తం చేస్తూ నితిన్ సింఘానియా పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

యువకుడి ఆత్మహత్య

బంజారాహిల్స్,జనవరి 16: అనుమానాస్పద స్థితిలో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..రాజస్థాన్‌లోని కరౌలి జిల్లా ఖేరియా ప్రాంతానికి చెందిన మోను కోలి(26) మార్బుల్ వర్క్ చేస్తూ బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 2లోని ఇందిరానగర్‌లో నివాసం ఉంటున్నాడు. అదే ప్రాంతంలో నివాసం ఉంటున్న కైలాష్ చంద్ స్నేహితుడు. కాగా బుధవారం ఉదయం కైలాష్ చంద్ తన గదికి తాళం వేసి రాత్రి ఇంటికి తిరిగొచ్చేసరికి గది తాళం పగలగొట్టబడి ఉంది. లోపలినుంచి గడియ పెట్టుకుని ఉండడంతో తలుపులు పగలగొట్టి చూడగా స్నేహితుడు మోనూ కోలి తాడుతో ఉరేసుకుని కనిపించాడు. కేసు దర్యాప్తులో ఉన్నది.

పారదర్శకంగా విచారణ చేపట్టాలి..

- 20 వరకు ఇంటింటి సర్వే పూర్తి చేయాలి
- రేషన్ కార్డులకు డబ్బు లడిగితే ఫిర్యాదు చేయండి
- చందానగర్ సర్కిల్ ఉప కమిషనర్ మోహన్‌రెడ్డి

రేషన్ కార్డుల ఇంటింటి విచారణపై మాట్లాడుతున్న డీసీ మోహన్‌రెడ్డి

మియాపూర్ , జనవరి 16 : ప్రభుత్వ ఆదేశాల మేరకు రేషన్ కార్డు దరఖాస్తులపై ఈ నెల 20 వరకు ఇంటింటి విచారణను పూర్తి చేయాలని చందానగర్ సర్కిల్ ఉప కమిషనర్ మోహన్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. రేషన్ కార్డులు ఇప్పిస్తామని చోటా మోటా నేతలు సహా మరెవరైనా చెబితే నమ్మవద్దని, వాటి పేరిట డబ్బులు వసూలు చేస్తే తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు. రేషన్ కార్డుల ఇంటింటి విచారణపై డీసీ మోహన్‌రెడ్డి గురువారం ఉదయం సర్కిల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటింటి సర్వే సందర్భంగా రేషన్ కార్డులు లేవని దరఖాస్తులు అందించిన వాటిపై లబ్ధిదారుల అర్హతపై ఈనెల 20 వరకు ఇంటింటి విచారణను చేపడుతున్నట్లు, ఒక్కో సిబ్బంది 50 దరఖాస్తులపై పారదర్శకంగా చేపట్టాలని ఆదేశించారు. సర్కిల్ వ్యాప్తంగా నాలుగు వార్డుల్లో కలిపి మొత్తం 2,236 దరఖాస్తులు అందినట్లు ఉన్నతాధికారుల నుంచి తమకు అందిన జాబితా మేరకు విచారణ చేయనున్నట్లు, ఇప్పటికే వాటిని వార్డులు, కాలనీల వారీగా విభజించి సిబ్బందికి అందించామన్నారు. అర్బన్ ప్రాంతాల్లో ఏడాదికి గరిష్టంగా రూ. 2లక్షల ఆదాయం ఉన్న వారు రేషన్ కార్డుకు అర్హులని, క్షేత్రస్థాయిలో తమ సిబ్బంది తగు విచారణ చేపట్టి అర్హతను నమో దు చేస్తారని డీసీ పేర్కొన్నారు. ఈ విచారణను అత్యంత పకడ్బందీగా విమర్శలకు తావులేకుండా చేపట్టి...అర్హులను గుర్తించి నివేదించాలన్నారు. రేషన్ కార్డులు ఇప్పిస్తామని కొందరు నమ్మబలికి డబ్బులు వసూలు చేసే ప్రమాదముందని, అలాంటి వాటిని నమ్మవద్దని డీసీ స్పష్టం చేశారు. రేషన్ కార్డు ఉండి మళ్లీ దరఖాస్తు చేసిన వారిని క్షేత్ర స్థాయిలో గుర్తించి ఉన్నత అధికారులకు నివేదిస్తామన్నారు. విచారణ సిబ్బంది పనితీరును ప్రత్యేక అధికారులు ఆకస్మిక తనిఖీల ద్వారా పరిశీలిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో పీవో ఉషా, ఏఎంసీ మహేందర్, కృష్ణ, విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ లబ్ధిదారుల వివరాల పరిశీలన

లబ్ధిదారుల వివరాలను అడిగి తెలుసుకుంటున్న డీసీ మల్లారెడ్డి

కుత్బుల్లాపూర్, జనవరి 16 : ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన కుల గణనలో రేషన్‌కార్డులు లేని లబ్ధిదారులను ఎంపిక చేసింది. దాని ఆధారంగా మున్సిపల్ సర్కిల్ అధికారులు, సిబ్బంది విస్తృతంగా పర్యటించి లబ్ధిదారుల వివరాలను పరిశీలించారు. ఈ మేరకు కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో 4,349 మంది లబ్ధిదారులు ఉండగా, గాజులరామారం సర్కిల్ పరిధిలో 4,471 మందికి సంబంధించిన లబ్ధిదారుల వివరాలను పరిశీలనను ఈ నెల 20 వరకు పూర్తి చేయనున్నట్లు సర్కిళ్ల ఉప కమిషనర్లు నర్సింహ, మల్లారెడ్డిలు తెలిపారు.

బీఆర్ఎస్ పేరును చెరిపేసే కుట్ర

ముషీరాబాద్, జనవరి 16: రాజకీయ కక్ష్యసాధింపును చర్యలు నిలిపివేసి పాలనపై దృష్టి సారించాలని సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ గ్రేటర్ నేత ఎంఎస్ శ్రీనివాసరావు సూచించారు. ప్రజా సమస్యలు గాలికి వదిలేసి లేనిపోని అపోహలు సృష్టించి బీఆర్ఎస్ పేరును చెరిపేయాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చి 13నెలలు అవుతున్నా పూర్తిస్థాయిలో మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసుకొనే పరిస్థితి లేదని విమర్శించారు. గురువారం భోలక్‌పూర్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఏమైనవో చెప్పకుండా సోషల్ మీడియా, మీడియాలో లేనిపోని లీకులు ఇచ్చి బీఆర్ఎస్ క్యాడర్‌ను భయభ్రాంతుల్ని చేయాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులను ఏరకంగా ఇబ్బందులు పెట్టాలే, ఎట్లా అరెస్టు చేయాలనే అలోచన తప్ప పాలనపై చిత్తశుద్ధి లేదని విమర్శించారు.

క్యాలెండర్ అందజేసిన బ్రహ్మకుమారీలు

మల్లికార్జునకాలనీలోని నివాసంలో ఓల్డ్‌బోయిన్‌పల్లి కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్‌కు నూతన సంవత్సర క్యాలెండర్‌ను అందజేస్తున్న ప్రజాపిత ఈశ్వరీయ బ్రహ్మకుమారీలు – బాలానగర్, జనవరి 16

కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 16 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో గురువారం కూరగాయల ధరలు ఈ కింది విధంగా ఉన్నాయి.(కేజీ–రూపాయలలో....)

టమాట కిలో రూ.13, వంకాయ 28, బెండకాయ 28, పచ్చిమిర్చి 55, బజ్జి మిర్చి 35, కాకరకాయ 38, బీరకాయ 38, క్యాబేజి 13, ఫ్రెంచ్ బీన్స్ 50, క్యారెట్ 40, కాలీఫ్లవర్ 30, దొండ 50, చిక్కుడు 50, గోరుచిక్కుడు 40, బీట్‌రూట్ 37, క్యాప్సికం 47, ఆలుగడ్డ 25, కీరా 23, దోసకాయ 18, సొరకాయ 20, పొట్లకాయ (1) 18, కందగడ్డ 60, ఉల్లిపా రక 45, ఉల్లిగడ్డ 35, మామిడికాయ(1) 15 నుంచి 20, అరటికాయ(1) 7 నుంచి 8, చామగడ్డ 38, ముళ్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 35, గుమ్మడికాయ 30, నిమ్మకా యలు(12) 30 నుంచి 40, మునగకాయ(1) 10 నుంచి 12, పచ్చి బఠానీ 45, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండుమిర్చి 200, అల్లం 80, వెల్లుల్లి 340, చింతపండు 140, కరివేపాకు 80గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలు లో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్య

నవీన్ (ఫైల్)

బాలానగర్, జనవరి 16 : భార్యాభర్తల మధ్య గొడవ కారణంగా మనస్తాపానికి గురైన ఆటో డ్రైవర్ బాలానగర్ ఫ్లైఓవర్ పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ నర్సింహరా జు తెలిపిన వివరాల ప్రకారం....వికారాబాద్ జిల్లా తాండూరుకు చెందిన ముడావత్ నవీన్ (27)కు భార్య మౌనికతో పాటు ఒక కుమార్తె ఉన్నారు. కాగా.. నవీన్ బతుకు దెరువు కోసం నగరానికి వలస వచ్చి ఫతేనగర్ డివిజన్, జింకలవాడలో నివాసముంటున్నాడు. బుధవారం రాత్రి భార్యతో గొడవపడిన నవీన్ మనస్తాపంతో ఆటోను బాలానగర్ ఫ్లైఓవర్‌పై పార్క్‌చేసి .. అక్కడి నుంచి కిందకు దూకాడు. తీవ్రంగా గాయపడిన నవీన్‌ను 108లో చికిత్స కోసం గాంధీ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా యావత్తు ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, నా క్లయింట్ అయిన శ్రీకరణం ప్రశాంత్ తండ్రి కరణం తులసిదాస్, నివాసం: లాలాగూడ, గాజులరామారం గ్రామ శివారులో గల సర్వే నం. 429, 430,431, 432, 433 విస్తీర్ణం 1.37 గుంటలు, వ్యవసాయ భూమి గౌరవ అప్పీలేట్ ట్రిబ్యునల్/ జాయింట్ కలెక్టర్ వారి కార్యాస్థానం నందు వారి ప్రతివాది అయిన శ్రీ వి. విమల దేవి భర్త: వి.వి.కె.వి. ప్రసాదరావు మరియు ఇతరులపై దావా వేయడంతో పాటు ఇనామ్ ట్రిబ్యునల్ వారు జారీ చేసిన ఉత్తర్వుల నం. ఎఫ్1/925/2024 తేది: 22.06.2024 సవాలు చేస్తూ అప్పీల్ వేయడం జరిగింది. సదరు కేసుకు సంబంధించి గౌరవ అప్పీలేట్ ట్రిబ్యునల్, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా వారు విచారణ చేపట్టి కేసు విచారణకై తేది: 28.12.2024 నందు వాదప్రతివాదనలు వినటానికి అవకాశం కల్పిస్తూ ప్రతివాదులైన శ్రీ వి. విమల దేవి గార్లు హాజరు కానందున పలుమార్లు వాయిదా వేయడం జరిగింది. ఇట్టి విషయానికి సంబంధించి పైన పేర్కొనబడిన ప్రతివాదులు హాజరు కానందున వారికి చివరి అవకాశం కల్పిస్తూ చివరిసారిగ విచారణ జరిపించబడును. అందుకు గాను హరు హాజరు కావాల్సిందిగా పత్రిక ప్రకటన ద్వారా తెలియజేయుటకు గాను గౌరవ అప్పీలేట్ ట్రిబ్యునల్/జాయింట్ కలెక్టర్ వారు తెలియజేయనైనది. కావున పైన పేర్కొన్న కారణాల దృష్ట్యా శ్రీ కరణం ప్రశాంత్ గారు గౌరవ అప్పీలేట్ ట్రిబ్యునల్/జాయింట్ కలెక్టర్, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా గారి ఆదేశాల మేరకు తేది: 25.01.2025 హాజరై తమకు సంబంధించిన కాగితపూర్వక సాక్ష్యాధారాలనుగాని లేదా మౌకిక వివరణ ద్వారా హాజరు కావాల్సిందిగా తెలియజేయనైనది.

సంప్రదించవలసిన వారు:
న్యాయవాదులు, యం.పి. ఆదిమూర్తి, కె.ఇ. జాన్‌వస్సీ, ఫ్లాట్ నం. 102, వెంకటసాయి వెస్ట్ అపార్ట్‌మెంట్, ఇం.నం. 12-2-505/31, 32,43& 44 గుడిమల్కాపూర్, మెహిదీపట్నం, హైదరాబాద్ – 500028
సెల్: 9849287705, 7993434515